క్లుప్తంగా

పాఠశాలల పరిశీలకునిగా రాజ్‌కుమార్


రాజ్‌కుమార్

దెందులూరు: ఏలూరు రూరల్ మండలం, నగరంలోని పాఠశాలల పరిశీలకునిగా దూబచర్ల డైట్ లెక్చరర్ కె.రాజ్ కుమార్ నియమితులయ్యారు. ఈమేరకు రాష్ట్ర పాఠశాల విద్యా డైరెక్టర్ లికిత పూర్వక ఆదేశాలు జారీ చేశారు. ఆయన వారానికి రెండు రోజులు పాఠశాలలను పరిశీలించి విద్యాశాఖ ఉన్నతాధికారులకు నివేదిక అందజేయనున్నారు. ఈ సందర్భంగా ఆయన్ని గురువారం ఎంఈఓలు అరుణ్ కుమార్, రవి ప్రకాష్‌లు అభినందించారు.

ఉద్యోగులకు పదోన్నతులు


ఉద్యోగికి పదోన్నతి ఉత్తర్వులు అందిస్తున్న మేయర్ నూర్జహాన్

ఏలూరు (టూటౌన్): ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న పదోన్నతులు కల్పిస్తూ నగరపాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్ గురువారం ఉత్తర్వులు ఇచ్చారు. హెల్త్ అసిస్టెంట్లు శనపతి అప్పారావు, బోను రాజులను శానిటరీ ఇన్‌స్పెక్టర్లుగా, బిల్ కలెక్టర్లు టి.సునీల్, ఎస్కే బాజీ, రికార్డు అసిస్టెంట్ టీఎస్ భూపాల్, ఫోర్త్ క్లాస్ ఎంప్లాయ్ ఎస్కే నజీర్‌లను జూనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించారు. నగరపాలక సంస్థలో వివిధ విభాగాల్లో ఖాళీ అయిన స్థానాల్లో అర్హులైన వారికి పదోన్నతులు కల్పించనున్నట్టు నూర్జహాన్ పెదబాబు తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ ఎ.భాను ప్రతాప్ అదనపు కమిషనర్ జి.చంద్రయ్య, మేనేజర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలోని వివిధ విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో లైన్ల మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏలూరు డివిజన్ ఈఈ కేఎం అంబేద్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏడు కాలువల సెంటర్, కొత్తగూడెం, మోటేపల్లి వారి వీధి, మేక వారి వీధి, కబేళా ప్రాంతం, తూర్పు వీధిశివాలయం, తూర్పువీధి సాయిబాబా మందిర ప్రాంతాలు, చిరంజీవి బస్టాండు ప్రాంతం, అశోక చక్రం ప్రాంతం, లోయదిబ్బ, పాలతూము సెంటర్, శనగపప్పు బజారు, దొంగల మండపం రోడ్డు, మాదేపల్లి రోడ్డు, సుంకర వారి తోట, ప్రేమాలయం ప్రాంతం, గాయత్రి నగర్, వెంకటాపురం ఎంపీ రోడ్డు, జాలిపూడి, లింగారావు గూడెం, కాట్లంపాడు, శ్రీపర్రు, మానూరు, ఎంహెచ్‌పురం, కలకుర్రు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు.

మైనర్ల డ్రైవింగ్.. పెద్దలకు హడల్

- లైసెన్స్ లేకుండానే వాహనాలు నడుపుతున్న విద్యార్థులు
- పట్టించుకోని పోలీస్, రవాణా అధికారులు
- తల్లిదండ్రుల్లోనూ అవగాహన కలిగించాలంటున్న ప్రజలు


ఏలూరులోని ఓ కార్పొరేట్ జూనియర్ కళాశాల వద్ద ఉన్న విద్యార్థుల ద్విచక్ర వాహనాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఇటీవల ద్విచక్ర మోటారు వాహనాల వినియోగం బాగా ఎక్కువైంది. ఏలూరు నగర రోడ్లపై ద్విచక్రవాహనాల రద్దీ విపరీతంగా పెరిగింది. ప్రతి ఇంటిలోనూ ద్విచక్రవాహనాలు అందుబాటులో ఉండడంతో కూరగాయలు తీసుకురావడానికో, పచారీ సరుకులు తీసుకురావడానికో తమ పిల్లలను ఆ వాహనాలు ఇచ్చి తల్లిదండ్రులే రోడ్లపైకి పంపుతున్నారు. పిల్లలు వాటిని అతివేగంగా నడుపుతూ ప్రమాదాలబారిన పడుతున్నారు. మైనర్ల నిర్లక్ష్యంగా నడుపుతుండడంతో పెద్దలు ప్రమాదాలకు గురై గాయాలపాలవుతున్నారు.

లైసెన్స్ లేకుండానే డ్రైవింగ్

రవాణా చట్టాల ప్రకారం 18 సంవత్సరాల వయసు నిండిన వారికే వాహనాలు నడపడానికి లైసెన్స్ జారీ చేస్తారు. అయితే తల్లిదండ్రులు తమ మైనర్ పిల్లలకు వాహనాలు ఇచ్చి ప్రోత్సహించడంతో ఇటీవల కాలంలో ప్రమాదాలు బాగా పెరిగిపోయాయని చెబుతున్నారు. కొన్ని సందర్భాల్లో మైనర్లు వాహనాలు నడుపుతుండగా ట్రాఫిక్ పోలీసులు, రవాణా అధికారులు వారిని ఆపి వారి తల్లిదండ్రులను పిలిచి వారికి కౌన్సెలింగ్ ఇస్తున్నా ఫలితం ఉండడం లేదు. గతంలో విద్యార్థులు సైకిళ్లపైనే పాఠశాల లేదా కళాశాలకు వెళ్లేవారు. కొందరు తల్లిదండ్రులు తమ స్థాయిని ప్రకటించుకోవడానికి ఇంటర్మీడియట్‌లోపు చదువుతున్న తమ పిల్లలకు కాలేజీకి వెళ్లేందుకు ఒక వాహనాన్ని కొని ఇస్తున్నారు. నగరంలోని అత్యంత బిజీగా ఉండే నరసింహారావు పేటలోనే అధికంగా కార్పొరేట్ జూనియర్ కళాశాలలు ఉండగా, ఆ కళాశాలల వద్ద ఎప్పుడు చూసినా మైనర్లు వేసుకుని వచ్చే ద్విచక్రవాహనాలు దర్శనమిస్తూనే ఉంటాయి.

పట్టించుకోని అధికారులు

నిబంధనలకు విరుద్ధంగా ద్విచక్రవాహనాలు నడిపే వారిపై కేసులు రాసి జరిమానాలు విధించడం చూస్తూ ఉంటాం. అయితే మైనర్లు ద్విచక్ర వాహనాలను నడిపే అంశంలో ట్రాఫిక్ పోలీసులు, రవాణా శాఖ అధికారులు ఎటువంటి చర్యలూ తీసుకోవడం లేదని నగర ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మైనర్ల నిర్లక్ష్యపు డ్రైవింగ్ కారణంగా రోడ్లపై నడిచి వెళ్లేవారు సైతం భయభ్రాంతులకు గురవుతున్నారని చెబుతున్నారు. ఆయా శాఖల అధికారులు బుద్ధి పుట్టినప్పుడు స్పెషల్ డ్రైవ్‌ల పేరిట తనిఖీలు చేసి కొద్దిగా కేసులు రాసి మమ అనిపిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

“

అవగాహన కలిగించాలి



మైనర్లకు ద్విచక్రవాహనాలు సమకూర్చే తల్లిదండ్రులకు అధికారులు అవగాహన కలిగించాలి. యుక్త వయసులో ఉన్న వారు వేగానికి ఇచ్చే ప్రాధాన్యతను ప్రాణాలకు ఇవ్వరు. అనుభవ రాహిత్యంతో వారు వేగంగా వాహనం నడపడం వల్ల కొన్ని సందర్భాల్లో కొందరు గాయాల పాలవడం, అవయవాలు కోల్పోవడం, ఒక్కోసారి మృత్యువాత పడడంతో కొన్ని కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఎదురవుతుంది.

– తాళ్లూరి చక్రవర్తి, కాంగ్రెస్ ఏలూరు ఉపాధ్యక్షుడు

తనిఖీలు చేస్తూనే ఉన్నాం



మోటారు వాహనాల ప్రత్యేక తనిఖీలు చేపడుతున్నాం. మైనర్ల తల్లిదండ్రులకు అవగాహన కలిగించడంతో పాటు మరోసారి ఇలా చేయవద్దని హెచ్చరిస్తున్నాం. అవి పునరావృతమైన సందర్భాల్లో జరిమానాలూ విధిస్తున్నాం. గతంలో 50 సీసీ కెపాసిటీ ఉన్న గేరులేని వాహనాలు నడపడానికి మైనర్లకు లైసెన్సులు ఇచ్చేవాళ్లం. ఇప్పుడా వాహనాలు లేవని, దీంతో మైనర్లకు డ్రైవింగ్ లైసెన్స్ ఇవ్వడం లేదు.

– కేఎస్ఎంవీ కృష్ణారావు, రవాణా అధికారి

ప్రజల్లో నమ్మకం కోల్పోతున్న ప్రభుత్వం


కార్యక్రమంలో మాట్లాడుతున్న జేపీ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ఆచరణ సాధ్యంకాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత పథలు అమలు చేయాలంటే భయమేస్తోందని చంద్రబాబు ప్రకటించడాన్ని పలాయన వాదంగా ప్రజలు భావిస్తున్నారని వైఎస్సార్ సీపీ ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి మామిళ్లపల్లి జయ ప్రకాష్ (జేపీ) అన్నారు. గురువారం నగరంలోని మదిరి నిర్మల జ్యోతి, జేవియర్ మాస్టర్ ఆధ్వర్యంలో, 16వ డివిజన్‌లో జుజ్జువరపు విజయ నిర్మల, జుజ్జువరపు రమేష్ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జేపీ పాల్గొని మాట్లాడారు. 24, 25, 26వ డివిజన్‌లలో స్థానిక నాయకులు జక్కుల బెనర్జీ, స్టాలిన్, మట్టా రాజు, వీరవల్లి లక్ష్మీ కుమార్, గోరుముచ్చు రవి, కొండేటి చిన్ని, స్థానిక నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు. 16వ డివిజన్‌లో స్థానిక నాయకులు కొండేటి పోతురాజు, వీర్ల కొండ, గుడిపూడి బాలస్వామి, పంతం తాతయ్య, పిలకల రెడ్డి, పార్టీ నాయకులు గుడిదేసి శ్రీనివాస్, నూకపెయ్యి సుధీర్ బాబు, నెరుసు చిరంజీవులు, జాన్ గుర్నాథ్, కిలాడి దుర్గారావు, తుమరాడ స్రవంతి పాల్గొన్నారు.

4న నైట్ వాచ్‌మెన్ల చలో విజయవాడ


డీఈఓకు వినతిపత్రం అందిస్తున్న ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాఠశాల నైట్‌వాచ్‌మెన్ల 5 నెలల జీతాల కోసం ఈ నెల 4న విజయవాడలో పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ కార్యాలయం వద్ద జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ నైట్‌వాచ్‌మెన్ల కమిటీ (ఏపీటీయూసీ) ఏలూరు జిల్లా కన్వీనర్ కంకిపాటి బుచ్చిబాబు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక జిల్లా విద్యాశాఖ అధికారిని కలిసి సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బుచ్చిబాబు మాట్లాడుతూ ప్రభుత్వం హైస్కూళ్లలో చదువుకొనే విద్యార్థులకు ఇంటర్నెట్ ద్వారా చదువు చెప్పడానికి కంప్యూటర్ పరికరాలు భద్రపరిచే క్రమంలో రాష్ట్రవ్యాప్తంగా 5333 హైస్కూల్‌కు నైట్ వాచ్‌మెన్లను నియమించిందన్నారు. అప్పటి ప్రభుత్వం సాయంత్రం 4 నుంచి మరుసటి రోజు ఉదయం 9 గంటల వరకు గౌరవవేతనం పేరుతో నెలకు రూ.6 వేలు ప్రకటించిందని గుర్తుచేశారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం 5 నెలల నుంచి వేతన బకాయిలు చెల్లించకపోవడంతో వాచ్‌మెన్‌ల కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని వివరించారు. దీనిపై ఉన్నతాధికారులను పలుమార్లు కలిసి విజ్ఞప్తి చేసినా సమస్య పరిష్కారం కాలేదని వాపోయారు. తప్పనిసరి పరిస్థితులలో ఈనెల 4న ధర్నా చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో నైట్ వాచ్‌మెన్ల కమిటీ ఏలూరు జిల్లా కో కన్వీనర్ కె.వెంకటేష్ పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవపై సమీక్ష

ఏలూరు(మెట్రో): అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ పథకం అమలుపై గురువారం సచివాలయం నుంచి వివిధ జిల్లా కలెక్టర్లతో సీఎం చంద్రబాబు నాయుడు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఏలూరు కలెక్టరేట్ నుంచి కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జేసీ ధాత్రిరెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఆత్మీయ కలయిక


మాజీ సీఎం జగన్‌తో తంబి కుటుంబ సభ్యులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పార్టీ లీగల్ సెల్ ఏలూరు నగర అధ్యక్షుడు ప్రత్తిపాటి తంబి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో తన కుటుంబసభ్యులతో కలిసి వెళ్లి అధినేతను కలిశారు.

ఏఆర్‌డీజీకేలో విద్యార్థి నాయకుల ఎన్నిక


ఎన్నికలో ఓటు వేస్తున్న విద్యార్థులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక ఒకటో డివిజన్‌లోని ఏఆర్‌డీజీకే నగరపాలక ఉన్నత పాఠశాలలో స్టూడెంట్ లీడర్ ఎన్నికలు గురువారం ప్రజాస్వామ్య పద్ధతిలో జనరల్ ఎన్నికల తరహాలో నిర్వహించారు. షెడ్యూల్ ప్రకారం నోటిఫికేషన్ విడుదల చేసి అభ్యర్థుల నుంచి నామినేషన్ పత్రాలు తీసుకోవడం, స్క్రూట్నీ అనంతరం అర్హత గల అభ్యర్థులను పోటీలో ఉంచడం, ఓటర్ల జాబితా ప్రకటించడం, అభ్యర్థులకు గుర్తులు కేటాయించడం, ప్రచారానికి సమయం ఇచ్చామని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉన్నమట్ల కాంతి జయకుమార్ తెలిపారు. ఎన్నికల అధికారులను నియమించడం, పోలింగ్ బాక్స్‌లను, పోలింగ్ సామగ్రిని సమకూర్చుకోవడం, ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం పాఠశాలలో ఎలక్షన్ అధికారి నియమ నిబంధనలను అనుసరించి పారదర్శికంగా, ప్రజాస్వామ్యయుతంగా స్టూడెంట్ లీడర్ ఎన్నికలను నిర్వహించినట్టు తెలిపారు. ఎన్నికల అధికారులుగా పాఠశాల సిబ్బంది వ్యవహరించారన్నారు. జీవీడీ మల్లేష్ కుమార్, ముంతా శ్రీనివాస్ ప్రిసైడింగ్ అధికారులుగా వ్యవహరించగా, ఏపీఓలుగా ఎం సురేష్ కుమార్, ఆర్‌వీఆర్‌కే వరప్రసాద్ ఇతర సిబ్బంది నిర్వహించారన్నారు. అనంతరం ఆరు రౌండ్లుగా కౌంటింగ్ ప్రక్రియ నిర్వహించి విజేతలను ప్రకటించామన్నారు. ఈ ఎన్నికల్లో మొత్తం ఆరుగురు విద్యార్థులు పోటీపడగా ఎస్‌పీఎల్‌గా జి.రామ్ చరణ్ తేజ (111 ఓట్లతో) గెలుపొందాడడని, ఏఎస్‌పీఎల్‌గా ఆర్ సాయి చరణి (90 ఓట్లతో) గెలుపొందారని పేర్కొన్నారు.

ఆ వాహనాల కొనుగోలులో జాగ్రత్త సుమా!


వాహనాలను తనిఖీ చేస్తున్న త్రీ టౌన్ పోలీసులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): సెకండ్ హ్యాండ్‌లో వాహనాలను కొనుగోలు చేసే సమయాల్లో అప్రమత్తంగా ఉండాలని త్రీటౌన్ ఎస్‌హెచ్‌ఓ వి.కోటేశ్వరరావు సూచించారు. గురువారం త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శాంతి నగర్ పెట్రోల్ బంక్ వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు. సెకండ్ హ్యాండ్ వెహికల్స్ కొనుగోలుదారులను గుర్తించి, వారి వద్దనున్న పత్రాలను పరిశీలించారు. సెకండ్ హ్యాండ్ వెహికల్స్‌ను కొనటం వల్ల దొంగతనాలకు పాల్పడిన వాహనాలను సీ బుక్కులు మార్చేసి ఇంజిన్ నెంబర్లు మార్చేసి, సెకండ్ హ్యాండ్ వెహికల్స్‌గా అమ్ముతున్నారని తెలిపారు. అటువంటి వాహణాలను కొనుగోలు చేస్తే కేసుల్లో చిక్కుకుంటారని హెచ్చరించారు. జిల్లా ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ ఆధ్వర్యంలో అటువంటి వెహికల్స్‌ను ఇటీవల గుర్తించి పోగొట్టుకున్న వాహనదారులకు రెండు రోజుల క్రితం అందజేశారన్నారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు, హెల్మెట్ లేని వారికి జరిమానాలువిధించారు. ఈ కార్యక్రమంలో త్రీ టౌన్ ఎస్సై పి.అప్పారావు, సిబ్బంది పాల్గొన్నారు.

జామాయిల్ లారీ బోల్తా


బోల్తా కొట్టిన లారీ

కుక్కునూరు: జామాయిల్ కర్రను తీసుకెళ్తున్న లారీ బుధవారం అర్ధరాత్రి మండలంలోని పెద్దరావిగూడెం గ్రామ సమీపంలో బోల్తా పడింది. జామాయిల్ కర్రల లోడ్‌తో కుక్కునూరు మీదుగా సారాపాక ఐటీసీ కర్మాగారానికి వెళ్తున్న లారీ రాత్రి 11 గంటల సమయంలో పెద్దరావిగూడెం, వెంకటాపురం గ్రామాల మధ్య టర్నింగ్ వద్ద బోల్తా పడింది. ఈ ఘటనలో లారీ డ్రైవర్ స్వల్పగాయాలతో బయటపడ్డాడు. ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు.

హాస్టల్‌లో మద్యం, సిగరెట్లు


హాస్టల్‌ను సందర్శించిన నాయకులు


హాస్టల్ దాబాపై మద్యం బాటిళ్లు

ఏలూరు (టూటౌన్): ఎస్సీ హాస్టల్ విద్యార్థులను చెడు మార్గంలోకి ప్రోత్సహించే విధంగా సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారుల పనితీరు ఉందని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్ ఆరోపించారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వారం రోజులుగా హాస్టల్లో సర్వే చేస్తున్నట్టు చెప్పారు. గురువారం రాత్రి ఎస్సీ బాలుర కళాశాల హాస్టల్లో సర్వే చేశామన్నారు. విద్యార్థులు హాస్టల్లో ఎప్పుడూ ఉండే బాత్రూం సమస్యలు భోజనం సరిగ్గా ఉండటం లేదని తెలిపారు. ఈ హాస్టల్లో సిగరెట్లు, మద్యం సేవించేవారు ఎక్కువ శాతం ఉన్నట్టు గుర్తించామన్నామరు. హాస్టల్ డాబా పై రాత్రి 10 నుంచి 12 గంటల మధ్యలో విద్యార్థులు, బయట వ్యక్తులు వచ్చి మందు తాగుతున్నారని తెలిపారు. వార్డెన్ ఎన్నిసార్లు చెప్పినా విద్యార్థులు మారడం లేదని తెలిపారు. ఈ ఏడాది అడ్మిషన్లు 50 శాతాని కంటే ఎక్కువ గానే పడిపోయింవన్నారు. హాస్టల్ మేడ పై అన్నీ సిగరెట్ ప్యాకెట్లు, గుట్కా ప్యాకెట్లు, మందు బాటిల్ ఉన్నాయని చెప్పారు. పక్కనున్న అంబేద్కర్ భవన్లో పైన కూడా ముందు బాటిల్స్ ఉన్నాయన్నారు. విద్యార్థులు ఈ ప్రాంతాల్లో మద్యాన్ని సేవిస్తున్నారని తెలిపారు. ఉన్నతాధికారులు ఈ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. శివాజీ, జయంత్, శివసాయి, చరణ్ పాల్గొన్నారు.

కూటమి పాలనలో మహిళలకు రక్షణ కరువు



జేపీని మర్యాదపూర్వకంగా కలిసిన స్రవంతి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్రంలో కూటమి పాలనలో మహిళలకు రక్షణ కరువైందని, ఎక్కడ చూసినా మహిళలపై దాడులు, హత్యాచారాలు పెరిగిపోయాయని వైఎస్సార్ సీపీ ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి మామిళ్లపల్లి జయప్రకాష్ (జేపీ) ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి సమయంలో రాష్ట్రంలోని మహిళా లోకానికి వైఎస్సార్ సీపీ మహిళా విభాగం నేతలు అండగా నిలవాలని ఆయన కోరారు. రాష్ట్ర మహిళా విభాగ జనరల్ సెక్రటరీగా నియమితులైన తుమరాడ స్రవంతి గురువారం తనను మర్యాదపూర్వకంగా కలిసిన నేపథ్యంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మహిళలను ఎలా మోసం చేస్తోందో తెలుపుతూ మహిళల్లో చైతన్యం తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు గుడిదేశి శ్రీనివాస్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు నెరుసు చిరంజీవులు, జిల్లా కార్యదర్శి తులసి, మహిళా నేతలు రూబీన, కొప్పుల నాగలక్ష్మి, శివ, కట్ట ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి


అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఇటీవల పెరుగుతున్న సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం సుబ్బారావు అన్నారు. మహిళా భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ, అదనపు ఎస్పీ అడ్మిన్ ఎన్ సూర్యచంద్రరావు ఆధ్వర్యంలో శక్తి టీం సభ్యులతో కలిసి సీఆర్ రెడ్డి పాలిటెక్నిక్ కాలేజీలో విద్యార్థులకు గురువారం సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సోషల్ మీడియా వేదికల (వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, టెలిగ్రామ్ మొదలైనవి) ద్వారా జరిగే మోసాలు, బ్లాక్ మెయిల్, ఫేక్ ఐడీ కేసులు గురించి వివరించారు. వ్యక్తిగత సమాచారం బహిరంగంగా పంచుకోవడంలో ఉన్న ప్రమాదాలు, ఫోన్ హ్యాకింగ్, ఫిషింగ్, ఓటీపీ ఫ్రాడ్స్ వంటి సైబర్ మోసాల్లో జరుగుతున్న పద్ధతులను వివరించారు. బాధితులు డయల్ 112, 1930 లేదా మెయిల్ ద్వారా ఫిర్యాదు చేయాలన్నారు. గుడ్ టచ్ - బ్యాడ్ టచ్ గురించి అవగాహన కల్పించారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	48	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	18	చిక్కుడు కాయలు	40
వంకాయలు (కాంతులు)	24	బిళ్లచిక్కుడు	120
వంకాయలు (తెలుపు)	30	చామదుంపలు	36
బెండకాయలు	36	ములక్కాడలు	08, 10
పచ్చిమిర్చి	70	కంద	00
కాకర కాయలు	36	బీట్‌రూట్	40
బీరకాయలు	36	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	46	ఫ్రెంచ్‌బీన్స్	90
క్యాబేజీ	26	అల్లం	86
క్యారెట్	40	కొత్తిమీర (కట్ట)	20
దొండకాయలు	38	పాలకూర	12
బంగాళదుంపలు	32	తోటకూర	10
ఉల్లిపాయలు	25	చుక్కకూర	12
గోరుచిక్కుడు	40	గోంగూర	07-10
దోసకాయలు	24	పుదీనా	05
అనబకాయ (1)	15-20	క్యాప్సికమ్	90
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	35
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	32
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	40
ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	20
ఏలూరు - అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	26
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.15	4822	28
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	23
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	26
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	21
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	24
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	19
ఏలూరు - తిరుపతి	16.00	4830	32

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి


మాట్లాడుతున్న డాక్టర్ హన్నా కోమలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): మత్తు పదార్థాలకు అందరూ దూరంగా ఉండాలని ప్రముఖ మానసిక వైద్యుడు కె.హన్నా కోమలి సూచించారు. జిల్లా మానసిక ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలు వినియోగం వల్ల కలిగే దుష్పరిమాణాలు, అనర్థాలపై స్థానిక శనివారపుపేటలోని బాలల సంరక్షణ కేంద్రంలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హన్నా కోమలి మాట్లాడుతూ మత్తు పదార్థాల వల్ల భవిష్యత్తు చిన్నాభిన్నం అవుతుందని, చెడు అలవాట్లకు దూరంగా ఉండి చదువుపైనే దృష్టి సారించాలని సూచించారు. బాలల సంరక్షణ కేంద్రం సూపరింటెండెంట్ పి.శ్రీవల్లి, డాక్టర్ కిషోర్, సైకాలజిస్ట్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

20న ఎలక్ట్రికల్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ సమావేశం


వాల్ పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): ఈ నెల 20న శ్రీకాకుళంలో ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రికల్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నట్టు యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు లింగమల్లు శ్రీనివాసరావు తెలిపారు. ఇఫ్టూ అనుబంధ యూనియన్ హేలాపురి ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక ఇఫ్టూ జిల్లా కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రికల్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ సమావేశానికి శ్రీనివాసరావు అధ్యక్షత వహించి, మాట్లాడారు. శ్రీకాకుళం సభలో భవన నిర్మాణ కార్మికులు, ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ హక్కుల సాధన తదితర సమస్యలపై చర్చించి భవిష్యత్తు కార్య చరణను ప్రకటిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా సభ పోస్టర్లను నాయకులు విడుదల చేశారు. ఇఫ్టూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు, అసోసియేషన్ నాయకులు, బత్తిన శ్రీనివాసరావు,అనుపోజు ఉమ విజయ సాయి, మైచర్ల శంకర్ రావు ,పిట్టా తరుణ్ సాయి కుమార్,తీడ సాయి కుమార్, సిరిగిరి సత్యనారాయణ, కాకర్ల సహదేవుడు,నెమల కృష్ణ, వి.జనార్దన్, గుడివాడ లీలా ప్రసాద్, సిహెచ్ కిరణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.